
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



నల్లగొండ

5
శుక్రవారం 12 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.178	258	294
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.180	260	295

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 23.4

రైతుకు టోకెన్ తంటాలు

- పేట మార్కెట్‌లో కొనసాగుతున్న టోకెన్ విధానం
- ఆ విధానం వద్దంటున్న రైస్ మిల్లర్లు
- ఎంత ధాన్యమైనా కొనుగోలుకు సిద్ధమంటున్న వైనం
- పనిభారం తప్పించుకోవడానికే అమలు చేస్తున్నారంటున్న రైతులు

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 11: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం విక్రయానికి రైతుల తాకిడి పెరుగుతోంది. గ్రామాల్లో ప్రభుత్వం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి, ఇబ్బందులు పడ లేని రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. మరికొంత మంది రైస్ మిల్లుల వద్దకు ధాన్యం తీసుకెళితే అడ్డుగోలుగా ధర తగ్గించి, రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. క్వింటాకు రూ.200 నుంచి రూ.300 వరకు ధర తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయలేక రైస్ మిల్లులకు విక్రయించి నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలన్న ఆలోచనతో రైతులు మార్కెట్‌లో లాభానికి ధాన్యం విక్రయిద్దామంటే అక్కడ కూడా రైతులను మార్కెట్ అధికారులు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. టోకెన్ వ్యవస్థను అమలుచేసి ధాన్యం రాకను అడ్డుకుంటున్నారు. ఈ నెల 10 నుంచి మార్కెట్‌లో టోకెన్ విధానం అమలు చేస్తున్నారు. ప్రతీరోజు మార్కెట్‌కు 20వేల నుంచి 30వేల బస్తాలు వచ్చే విధంగా టోకెన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. మార్కెట్ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు (రైస్‌మిల్లర్లు), రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ధాన్యంతో మార్కెట్‌కు వచ్చిన రైతులు టోకెన్ లేకపోవడంతో మార్కెట్ నుంచి వెనుదిరిగిపోతున్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు రోజుకు లక్ష బస్తాలు వచ్చినా తాము కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఓ వైపు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రైస్ మిల్లర్లు తెలియజేస్తున్నారు. మార్కెట్‌కు భారీగా ధాన్యం వచ్చే అవకాశాలు ఉండటంతో వాటి కాంటాలు, ఎగుమతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు టోకెన్ విధానం ప్రవేశపెట్టినట్లు మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ అధికారులు టోకెన్ విధానం ప్రవేశపెట్టడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టోకెన్ విధానంవల్ల టోకెన్ ఉన్న రైతులు మాత్రమే మార్కెట్‌లో ధాన్యం విక్రయించడానికి వీలుంటుంది. అయితే టోకెన్ లేని రైతులను ఎట్టి పరిస్థితిలో మార్కెట్‌లోకి అనుమతించరు. మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న కమీషన్‌దారులు గత సంవత్సరం వారు చేసిన వ్యాపార లావాదేవీల ఆధారంగా మార్కెట్ అధికారులు టోకెన్లు ఇస్తున్నారు. అంటే ఒక కమీషన్‌దారుడికి రెండు నుంచి మూడు టోకెన్ల కంటే ఎక్కువ ఇవ్వడం లేదు. అంటే ఒక కమీషన్‌దారుడి వద్దకు ముగ్గురు రైతుల కంటే ఎక్కువమంది రావడానికి అవకాశం లేదు. పండించిన పంటను స్వేచ్ఛగా మార్కెట్‌లో విక్రయించే వెసులుబాటు లేకుండా మార్కెట్ అధికారులు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టోకెన్ల కోసం పైరవీలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్ అధికారులు, కమిటీ సభ్యులు, రాజకీయ నేతల చుట్టూ టోకెన్ల కోసం ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కార్యాలయానికే పరిమితమైన అధికారులు, సిబ్బంది

పేట మార్కెట్‌లో ఒక కార్యదర్శి, ఒక అసిస్టెంట్ కార్యదర్శి, గ్రేడ్ టూ కార్యదర్శి, ఐదుగురు సూపర్‌వైజర్లు, ఒక యూడీసీ, వీరందరూ రెగ్యులర్ ఉద్యోగులు. వారిలో ఏ ఒక్కరూ కూడా మార్కెట్ యార్డులలో పర్యవేక్షణ చేయరని కమీషన్‌దారులు ఆరోపిస్తున్నారు. ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు కార్యాలయానికే పరిమితమవుతారనే విమర్శలున్నాయి. రైతులకు ఖరీదుదారులు చెల్లిస్తున్న ధరలపై పర్యవేక్షణ చేయడం లేదని పలువురు ఆరోస్తున్నారు.

రోజుకు 30వేల బస్తాల వరకే అనుమతి

ఈ నెల 10 నుంచి ప్రవేశపెట్టిన టోకెన్ విధానం వల్ల మార్కెట్‌కు 30వేల బస్తాల కంటే ఎక్కువ ధాన్యం వచ్చే అవకాశం లేదు. పేట మార్కెట్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. మార్కెట్‌కు రోజుకు 50వేల నుంచి 70వేల బస్తాలు వచ్చినా వాటిని కాంటావేసి, ఎగుమతి చేసే వీలుంది. గత సీజన్‌లో రోజుకు 50 వేల బస్తాలకు వరకు వచ్చినా గత మార్కెట్ కార్యదర్శి టోకెన్ విధానం తీసుకురాలేదు. ఇటీవల మార్కెట్ కార్యదర్శి టోకెన్ విధానం ప్రవేశపెట్టడం ఏమిటని రైస్ మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. 33 ఎకరాలకు పైగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌లోకి కేవలం 30వేల బస్తాలకే టోకెన్ విధానం ప్రవేశపెట్టడం మార్కెట్ అధికారుల అసమర్థతకు నిదర్శనమని ఆరోపిస్తున్నారు. మార్కెట్ కార్యదర్శి మార్కెట్‌లో ఉన్న సిబ్బందితో సమన్వయం చేస్తే రోజుకు లక్ష బస్తాలు వచ్చినా ఎలాంటి టోకెన్ విధానం లేకుండానే వ్యాపారం నిర్వహించవచ్చునని రైస్ మిల్లర్లు అంటున్నారు.



పేట మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపార అనుమతులు (లైసెన్స్) పొందిన కమీషన్‌దారులు 125 మంది, రైస్ మిల్లుల నుంచి లైసెన్స్‌లు ఉన్న మిల్లర్లు సుమారు 17 మందికి పైగా ఉన్నారు. ఈ 17 మంది రైస్ మిల్లర్లు మార్కెట్‌లో టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. మార్కెట్‌కు రోజుకు ఎన్ని బస్తాలు వచ్చినా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నారు. మార్కెట్‌కు జోరుగా ధాన్యం వస్తున్న తరుణంలో టోకెన్ విధానం ప్రవేశపెట్టడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు.

టోకెన్లకోసం రాత్రి వరకూ వేచి చూశాం



ఈ నెల 10వ తేదీన మార్కెట్‌లో ధాన్యం విక్రయించడానికి రాత్రి పొద్దుపోయే వరకూ టోకెన్ల కోసం తిరిగాం. అడ్తి అసోసియేషన్ వాళ్లు మీ కమీషన్‌దారుడికి టోకెన్లు ఇచ్చామన్నారు. కమీషన్‌దారుడి దగ్గరకు పోతే తనకు రెండు టోకెన్లు మాత్రమే ఇచ్చారని చెప్పారు. టోకెన్ విధానం వల్ల టోకెన్ల కోసం కమీషన్‌దారుల చుట్టూ తిరిగాల్సి వస్తోంది. ఆర్-64 రకం ధాన్యానికి రూ.1,680ధర వేశారు. బయట ధరలతో పోల్చితే క్వింటాకు రూ.300 వరకు నష్టపోయాను.

కొరవి నాగమల్లు, పాతర్లపహాడ్ గ్రామం, ఆత్మకూర్ (ఎస్) మండలం

మార్కెట్ నిబంధనలు మార్చలేం



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో టోకెన్ విధానం వద్దు అనడానికి వాళ్లు (రైతులు, రైస్ మిల్లర్లు) ఎవరు. వాళ్లు టోకెన్ విధానం వద్దు అంటే కుదరదు. వాళ్లకోసం మార్కెట్ నిబంధనలను మార్చలేం. మార్కెట్‌కు ఎక్కువ మొత్తంలో ధాన్యం వస్తుంటే వాటిని కట్టడి చేయడంకోసం టోకెన్ విధానం తీసుకొచ్చాం. ధాన్యం కాంటాలు, ఎగుమతులు సజావుగా సాగాలంటే టోకెన్ విధానం అవసరం. ఎప్పటినుంచో మార్కెట్‌లో టోకెన్ విధానం ఉంది. ఆవిధానాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నాం.

బీవీ రాహుల్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

రైతే రాజు అన్నారు. దేశానికి వెన్నుముక అన్నదాతే అన్నారు. కానీ అదే రైతుకు వెన్ను విరుగుతోంది. ప్రకృతి విలయతాండవానికి, తెగుళ్ల బెడదకు, నకిలీల మోసాలకు అడ్డుకట్ట వేసి.. ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే.. తీరా విక్రయిద్దామంటే అడుగడుగునా ముంచుతున్నారు. పొలం నుంచి పంటను మార్కెట్‌కు తెస్తే తేమ, తాలు పేరుతో మిల్లర్లు, అధికారుల మాయాజాలంలో బిక్కమొఖం వేస్తున్నారు. రోజుల తరబడి నిరీక్షించే ఓపిక లేక, వారు చెప్పిన ధరకు విక్రయిస్తూ ఇంటిబాట పడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒకే ధాన్యానికి రెండు చోట్ల రెండు ధరలు పలకడం ఇందుకు నిదర్శనంగా కన్పిస్తోంది.

కొనేందుకు.. కొర్రీలు



ఒకే ధాన్యానికి రెండు ధరలా?

- పేటలో క్వింటాకు రూ.2200, మిర్యాలగూడలో రూ.2600


(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

రైతుల కష్టానికి ప్రతిఫలం లేకుండా పోతోంది. ఎంతో కష్టపడి పంటలు పండిస్తే అది చేతికొచ్చాక, ధాన్యాన్ని విక్రయించే సమయంలో నష్టపోతున్నారు. ఇలా ప్రతీ సీజన్‌లో నష్టపోతూనే ఉన్నారు. ఒక సీజన్‌లో ధర బాగా వచ్చిందని చింట్లు రకాన్ని సాగు చేస్తే, మిల్లర్లు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈసారి శ్రీరాంసాగర్ రెండో దశ వారబంది తరహాలో కాల్వలకు నీటిని విడుదల చేశారు. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరందలేదు. ఒక రైతు నాలుగు ఎకరాలు సాగుచేస్తే అందులో ఒక ఎకరం ఎండిపోయింది. బోర్లు, బావుల కింద సేద్యం చేసిన రైతుల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగర్ ఎడమ కాల్వ నీటి విడుదల చేయక పోవడంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల రైతులు నష్టపోయారు. కనీసం రెండు తడులకు నీటిని విడుదల చేసినా కొంత గట్టెక్కేవారు. సూర్యాపేట జిల్లాలో యాసంగి వరిసాగు విస్తీర్ణం 3,81,000 ఎకరాల్లో ఉండగా, ధాన్యం ఉత్పత్తి 3,61,445 మెట్రిక్ టన్నులు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు ధాన్యం దిగుబడి కూడా వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ కొనుగోలు కేంద్రాల్లో కేవలం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం ఏ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2203 మాత్రమే లభిస్తుంది. ధాన్యం గ్రేడ్ సాధారణ రకానికి రూ.2183 మాత్రమే లభిస్తుంది. దీంతో చింట్లు అనే ధాన్యం రకానికి విక్రయించడానికి అవకాశం లేకుండా పోయింది. చింట్లు తప్పనిసరిగా బయట మార్కెట్‌లోనే విక్రయించాల్సి వస్తుంది.

ఉమ్మడి జిల్లాలోనే చింట్లకు రెండు రకాల ధరలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చింట్లకు రెండు రకాల ధరలు మిల్లర్లు చెల్లిస్తున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన మిల్లర్లు చింట్ల క్వింటాకు ధర రూ.2200 మాత్రమే చెల్లిస్తుండగా అదే మిర్యాలగూడలోని మిల్లర్లు క్వింటాకు ధర రూ.2650 చెల్లిస్తున్నారు. గత సంవత్సరం మంచి ధర లభించడంతో సూర్యాపేట జిల్లాలో దాదాపు 1.50లక్షల ఎకరాల్లో చింట్లు సాగు చేశారు. తీరా విక్రయించడానికి వచ్చేసరికి గ్రేడ్-ఏ రకానికి ఏవిధంగా మద్దతు ధర చెల్లిస్తున్నారో అదేవిధంగా చెల్లిస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవానికి చింట్లు రకం బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లోనే మంచి డిమాండ్ ఉంది. గత సంవత్సరం క్వింటా రూ.4వేలు ధర కూడా పలికింది. ఒక సీజన్‌లో ధాన్యానికి ధర పలికితే మరో సీజన్‌లో అమాంతం పడిపోతుంది.

మిల్లర్లదే ఇష్టారాజ్యం



ఉమ్మడి జిల్లాలో మిల్లర్లదే ఇష్టారాజ్యంగా మారింది. చింట్ల విక్రయానికి రైతులు వస్తే క్వింటాకు రూ.2200 మాత్రమే చెల్లిస్తున్నారు. అంతేగాక ధాన్యం ఆరబెట్టాలని, ఆరబెట్టిన ధాన్యం తీసుకొస్తే నూక బాగా అవుతుందని కొర్రీలు పెడుతున్నారు. మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యంపై అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ధర తక్కువగా ఉన్నప్పటికీ దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించడానికి ఇష్టపడని రైతులు ఇక్కడే విక్రయిస్తున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఒక మిల్లర్‌కు బీబీగూడెంలో ఒక మిల్లు ఉండగా, మిర్యాలగూడలో మరో మిల్లు ఉంది. సూర్యాపేటలోని మిల్లులో క్వింటా చింట్లకు రూ.2200 ధర పలికితే అదే మిర్యాలగూడ మిల్లులో రూ.2600 నుంచి రూ.2650 దాకా ధర చెల్లిస్తున్నారు. ప్రతీ మిల్లులో రోజుకు 50ట్రాక్టర్ల ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ఒక ట్రాక్టర్‌కు 50 క్వింటాళ్ల ధాన్యం వస్తుంది. ఈ నేపథ్యంలో క్వింటాకు రూ.400 తక్కువగా కొనుగోలు చేయడం వల్ల కేవలం ఒక ట్రాక్టరుకు రూ.20వేలు అదనంగా ఆదాయం మిల్లర్లకు లభిస్తుంది. రోజుకు 50ట్రాక్టర్లు కొనుగోలు చేస్తే సుమారు రూ.10లక్షల దాకా రైతులనుంచి దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యంగా మార్చి రైస్ మిల్లర్లు విక్రయించుకొని లాభాలు గడిస్తారు. కానీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఒక చోట ఒక ధర ఉంటే మరోచోట మరో ధర ఉండడం గమనార్హం.

ఐరిష్‌తో అక్రమాలకు అడ్డుకట్ట పడేనా...?

ధాన్యం కొనుగోళ్లకు కొత్త విధానం అమలు

మోత్కూరు: ధాన్యం విక్రయాల్లో దళారీ వ్యవస్థను రూపుమాపాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఐరిష్ (కనుపాప) విధానం అమల్లోకి తెచ్చింది. గతంలో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నేరుగా బిల్లు చేయించుకునే వారు. కొంత కాలం తర్వాత రైతుల కన్నా ఎక్కువగా దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చి విక్రయిస్తున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటీపీ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయినా దళారీ వ్యవస్థకు అడ్డకట్ట పడలేదని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఐరిష్ విధానాన్ని అమలు చేస్తోంది. స్థానిక అధికారుల్లో నిజాయితీ లోపించినప్పుడు ఏ విధానమూ దళారీ వ్యవస్థను ఆపలేదని, ఐరిష్ విధానంతో కొందరు రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 929 కేంద్రాలు ఏర్పాటు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐకేపీ, సింగిల్ విండోల ద్వారా 929 ధాన్యం కేంద్రాలు తెరిచి 16.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలన్నది ప్రభుత్వ లక్ష్యం. యాదాద్రి భువనగిరి జిల్లాలో 323 కేంద్రాల ద్వారా 5.25లక్షల మెట్రిక్ టన్నులు, సూర్యాపేట జిల్లా 236 కేంద్రాల ద్వారా 3.54లక్షల మెట్రిక్ టన్నులు, నల్లగొండ జిల్లాలో 370 కేంద్రాల ద్వారా 7.56లక్షల మెట్రిక్ టన్నులు కొననున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిల్లులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌ను ఖరారు చేశారు. అయినా మోత్కూరు మండలంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు రాశులను పరిశీలించారే తప్ప కాంటాలు మాత్రం వేయడం లేదు. కొన్నిచోట్ల ఇంకా కేంద్రాలే ప్రారంభించలేదు.

ప్రతి రైతూ కేంద్రానికి రావాల్సిందే

గతంలో రైతు ఎక్కడ ఉన్నా రైతు ఆధార్, బ్యాంకు ఖాతా జీరాక్స్‌లు కొనుగోలు కేంద్రంలో ఇచ్చి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ చెబితే సరిపోయేది. ఓటీపీ ట్యాబ్‌లో నమోదు చేసి ధాన్యం కొని బిల్లు చేసేవారు. ఈ విధానంతో ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొన్న ధాన్యాన్ని తమకు అనుకూలంగా ఉన్న రైతుల పేరున విక్రయిస్తున్నారన్న భావన ప్రభుత్వంలో ఉంది. దానికి అడ్డుకట్ట వేయడానికే ఐరిష్ విధానం అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విధానంలో ప్రతి రైతూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి రావాల్సిందే. ఆయన్ను ఐరిష్‌తో గుర్తించాకే ధాన్యం కొని బిల్లు చేస్తారు.

కౌలు రైతులకు మరీ ఇబ్బంది



ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పౌరసరఫరాల శాఖ అందించిన ఐరిష్ కెమెరా

కౌలు రైతులు కూడా ధాన్యం విక్రయించుకోవచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక అధికారులు అది సాధ్యపడదంటున్నారు. భూమిని కౌలుకు ఇచ్చిన రైతు నుంచి కౌలు పత్రం తీసుకవస్తేనే కౌలురైతు పేరున ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంటు సిస్టమ్)లో పంట నమోదు చేస్తామని ఏఈవోలు చెబుతున్నారు. క్రాప్ బుకింగ్ జరిగినప్పుడే రైతుల పేరున పంట నమోదు చేశామని, ఇప్పుడు ఆ పంటను కౌలు రైతు పేరున మార్చాలంటే కౌలు పత్రం కావాలని, తాము అడిగినప్పుడు రైతు కూడా తన భూమిని కౌలుకు ఇచ్చానని చెప్పాలంటున్నారు. ఇప్పటి వరకూ ఏ రైతూ కౌలు రైతుకు కౌలు పత్రం ఇవ్వడం లేదు. ఇక ముందు కూడా ఇచ్చే అవకాశాలు లేవంటున్నారు. కౌలు రైతు గుర్తింపు అనేది ఓ చిక్కుముడి సమస్య. అది ఇప్పట్లో తేలేది కాదు. దూర ప్రాంతాల్లో, ఉద్యోగాలు, ఇతర వ్యాపకాల్లో ఉన్న రైతులు తాము ధాన్యం విక్రయించినప్పుడు కేంద్రానికి రమ్మంటే వస్తారో లేదోనని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా వాస్తవ రైతుల్లోనూ కొందరికీ ఐరిష్ కాక ఇబ్బందులు తప్పవంటున్నారు. కంటిలో పొర వచ్చిన వారు, కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఐరిష్ ఇబ్బందేనంటున్నారు.

అన్ని కేంద్రాలకు ఐరిస్ కెమెరాలు సరఫరా

ఉమ్మడి నల్లగొండలో తెరిచిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పౌరసరఫరాల శాఖ వారు ఐరిష్ కెమెరాలను అందించినట్లు కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా

- ఎంపీపీ సహా ఐదుగురు ఎంపీటీసీలు, 16 మంది మాజీ సర్పంచులు..



బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 11: ఉమ్మడి పీఏపల్లి మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఆ పార్టీలో సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి వెంటే తమ ప్రయాణం అంటూ ఉమ్మడి పీఏపల్లి మండలంలోని బీఆర్ఎస్ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి సహా ఐదుగురు ఎంపీటీసీలు, 16 మంది మాజీ సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి సహా ఆరుగురు డైరెక్టర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కలిపి మొత్తం 200 మంది ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. వీరందరి రాజీనామాతో మండలంలో మిగిలిన పార్టీ కేడర్ అయోమయంలో పడింది. ఈ నెల 13న దేవరకొండ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి సమక్షంలో చేరనున్నట్లు సమాచారం. రాజీనామా చేసిన వారిలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి పరమేష్, బోయ సుధాకర్‌రెడ్డి, యువనేత ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచులు కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, శీలం శేఖర్‌రెడ్డి, రమావత్ చందునాయక్, గోర్ల సైదమ్మ శ్రీనివాస్, కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

గొంతెండుతోంది !

- దేవరకొండ డివిజన్‌లో అడుగంటిన భూగర్భజలాలు
- తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ.. సాగర్ ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం
- పీఏపల్లి మండలంలో 17 గ్రామాల్లో తాగునీటి కటకట



7

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు
- ఈద్గాల వద్ద పటిష్ఠ బందోబస్తు





జిల్లాకేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, పాల్గొన్న కోమటిరెడ్డి, జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్ ఏప్రిల్ 11: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా ప్రాంగణంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిలతో కలిసి వేడుకల్లో పాల్గొని, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధల నడుమ జరుపుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

జిల్లా కేంద్రంలో ఘనంగా..

పవిత్ర ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగను ముస్లింలు జిల్లాకేంద్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని మునుగోడురోడ్‌లో గల ఈద్గాకు అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై సామూహికంగా ప్రార్థనలు చేశారు. మత గురువు మౌలానా ఎహసానోద్దీన్ ప్రార్థనలు చేయించారు. సుమారు గంటసేపు వివిధ రకాలుగా అల్లాను ప్రార్థించారు. తొలుత ఈద్గాలోకి తనిఖీ చేసిన తర్వాతే అనుమతించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కౌన్సిలర్లు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, ముస్లిం పెద్దలు డాక్టర్ హఫీజ్‌ఖాన్, ఏఏ ఖాన్, ఇంతియాజ్ అలీ, సలీం, ఆదిరెడ్డి, పుచ్చకాయల నర్సిరెడ్డి, హాషం, షరీఫ్, కరీమ్ అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పూలే ఆశయాలు సాధించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 11: జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక క్లాక్ టవర్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక క్లాక్ టవర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, టి.పూర్ణచందర్‌లు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బీసీ సంక్షేమశాఖ అధికారి వి.రమేష్, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లోగల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, కాసోజు విశ్వనాథం, నేలపట్ల సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, రమేష్, పర్వతాలు, పరమేష్, జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా

నిత్య తిరుకల్యాణం



ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 11: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్య క్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణపర్వాలు వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో, అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలి పూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,93,918 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల కోలాహలం

రంజాన్ సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు తరలివచ్చిన తీర్థజనులతో కొండపై రద్దీ నెలకొంది. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు, ఘాట్ రోడ్డు, కొండపైన, కింద ఆలయ క్యూలైన్లు, తిరువీధుల్లో భక్తజనుల రద్దీ ఉంది. సుమారు 15వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టింది. ఇటీవల ఏర్పాటు చేసి షెడ్డు కింద, ఆలయ ప్రాకార మండపాల చుట్టూ భక్తులు సేదతీరారు.

వైభవంగా మట్టపల్లి లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 11 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నిత్యశాశ్వత కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర కుంకుమార్చన, అనంతరం కల్యాణ తంతులో భాగంగా ఎదుర్కోళ్ల ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

నృసింహుడిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి

మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టీ మల్లికార్జున్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం పట్టుశాలువాతో ఆలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ పాలకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



న్యాయమూర్తిని సన్మానిస్తున్న ధర్మకర్తలు

ఎండుతున్న గొంతులు, పంటలు

- దేవరకొండ డివిజన్‌లో ప్రమాదఘంటికలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- సాగర్ ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం

అడుగంటిన భూగర్భజలాలు, ఎండలతో తాగు, సాగు నీటి కోసం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ ప్రజలు అల్లాడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో చెరువులు, కుంటలు వట్టిపోయాయి. మరోవైపు నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులూ నీరులేక వెలవెలబోతున్నాయి.

● దేవరకొండ

దేవరకొండ డివిజన్‌లో గతేడాది జనవరిలో సాధారణ వర్షపాతం 19.1 మిల్లీమీటర్లు కాగా 0.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది జనవరిలో 0.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిషన్‌భగీరథ ద్వారా గ్రామాలకు నీరు అందిస్తున్నా అవి సరిపడటం లేదు. దీంతో బోరు, బావులకు మరమ్మతులు నిర్వహిస్తూ నీరందించేందుకు చర్యలు చేపడుతున్నారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని మోత్యతండా, కంబాలపల్లి, చింత్రియాల, తెల్‌దేవరపల్లి, కాచరాజుపల్లి, రేకులగడ్డ, పెద్దమూల, కొండమల్లేపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించి నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలోని వేలాది పశువులను నాగార్జునసాగర్, కృష్ణాపరివాహక ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాకు మేత కోసం తరలించారు. దేవరకొండ మునిసిపాలిటీలో 20 వార్డులకు 5.7ఎంఎల్‌డీ(మిలియం లీటర్ ఫర్ డే) నీటి సరఫరా చేయాల్సి ఉండగా 4 ఎంఎల్‌డీ మాత్రమే విడుదల చేస్తుండడంతో పట్టణంలోని హనుమాన్‌నగర్, అయ్యప్పనగర్, గాంధీబజార్, సంతోషిమాతకాలనీ ప్రజలకు మూడు, నాలుగు రోజులకు ఒక్కసారి కృష్ణాజలాలు సరఫరా అవుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





కంబాలపల్లిలో చేదుడు బావి నుంచి మోటార్లతో నీటిని సరఫరా చేసుకుంటున్న గ్రామ స్థులు, చందంపేట తిమ్మాపురంలో అరకొరగా నీరుపోస్తున్న బోరు

సాగర్‌లో ఎమర్జెన్సీ మోటార్ల ద్వారా..

నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ఘననీయంగా తగ్గుతోంది. దీంతో రూ.5 కోట్లతో ఎమర్జెన్సీ మోటర్లు బిగించి హైదరాబాద్ జంటనగరాలతో పాటు నల్లగొండ జిల్లాకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సాగర్‌లో 508 అడుగులకు నీటిమట్టం చేరితే ఏఎమ్మార్పీ మోటర్లు పనిచేయవు. ఎమర్జెన్సీ మోటర్లను బిగించి నీటిని తోడి నీరు అందించాల్సి ఉంటుంది. అందుకుగాను నీటిపారుదలశాఖ, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు అధికారులు ముందస్తుగా సన్నద్ధమవుతున్నారు.

17గ్రామాల్లో తాగునీటికి తిప్పలు

పెద్దఅడిశర్లపల్లి: అధికారుల నిర్లక్ష్యం 17 గ్రామాలకు శాపంగా మారింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలినా మరమ్మతులు చేపట్టకపోవడంతో రెండు నెలలుగా తాగునీటికి తిప్పలు పడాల్సి వస్తోంది. దీంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి బిందెల్లో నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కోదండపురం ప్లాంట్ వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై భగీరథ పైప్‌లైన్ పగడంతో కోదండపురం, మాదాపురం, భీమనపల్లి, రాయినిపాలెం, ఘనిపల్లి, పోల్కంపల్లి, ఘనపురం, రంగారెడ్డిగూడెం, మేడారం, తిరుమలగిరి, దుగ్యాల, పెద్దవూర మండలం మూడు గ్రామాలకు నీళ్ల సరఫరా కావడంలేదు. అయినా అధికారులు వేగంగా మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా పైప్‌లైన్ పగిలి నీటి సరఫరా నిలిచిన మాట వాస్తవమేనని మిషన్ భగీరథ ఏఈ అజిత్ తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతుల కోసం హైవే అధికారులకు వినతిపెట్టామని, ఎమ్మెల్యేతో కూడా మాట్లాడించా మన్నారు. కాని వారి నుంచి ఎలాంటి అనుమతులు రాలేదన్నారు. అనుమతులు రాగానే మరమ్మతులు చేపడతామన్నారు.

రూ.5 కోట్ల నిధులు

నియోజకవర్గంలోని చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి, చింతపల్లి, డిండి మండలాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 480 గ్రామాలకు 248 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఉందని అధికారులు గుర్తించారు. నీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే బాలునాయక్ రూ.5.28 కోట్లు కేటాయించారు. బోర్లు వేసి తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు మంచి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

బోర్లలో తగ్గుతున్న నీరు, ఎండుతున్న పంటలు

దేవరకొండ నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటి బోరు, బావులలో నీరు తగ్గింది. ఈ ఏడాది చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి మండలాల్లో బోరు బావుల వద్ద వేరుశనగ, కూరగాయలు, దొండతోటలు, ఆరుతడి పంటలు లక్షా 20 వేల ఎకరాల వరకు సాగు చేశారు. భూగర్భలాలు అడుగంటిపోతుండడం, బోర్లలో నీరు తగ్గుతుండటంతో వేరుశనగ పంట ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు.

డిండి నీటితో నింపాలి

డిండి ప్రాజెక్టు నీటిమట్టం 36 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 32 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తే చందంపేట, నేరేడుగొమ్ము, డిండి మండలాల్లోని 26 చెరువులు నిండుతాయి. దీంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు పశువులకు తాగునీరు అందనుంది.

సరిపడా కృష్ణాజలాలు రావడం లేదు



తండాకు కృష్ణాజలాలు సరిపడా రావడంలేదు. నీటి కోసం పడిగాపులు గాస్తున్నా. తండా శివారులోని బోరు, బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నా. తండాకు సరిపడా నీటిని సరఫరా చేయాలి.

\- లీల హంక్యతండా, చందంపేట.

డిండి నీటితో చెరువులు, కుంటలు నింపాలి

బోరు బావుల కింద మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. అందుకుగాను రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టా. ఎకరన్నర వరకు నీరులేక ఎండింది. పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. డిండి ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదలచేసి సమస్యను పరిష్కరించాలి.

\- జబ్బు సత్తయ్య, రైతు చందంపేట.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



దేవరకొండ నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.5.28 కోట్లు మంజూరు చేశాం. అధికారులతో సమీక్ష నిర్వహించి నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించాం. బోర్లు వేసి నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం.

\- బాలునాయక్, ఎమ్మెల్యే



మోడువారుతున్న చెట్లు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలో వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి బత్తాయి తోటలు, వరి పంటలు ఎండిపోతున్నాయి. పెండ్లిపాకల పంచాయతీపరిధిలోని బాబ్లతండాకు చెందిన ఓ రైతు ఏడేళ్ల నుంచి ఐదు ఎకరాల బత్తాయి తోట, మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. వర్షాభావ పరిస్థితులతో రెండు బోర్లు ఎండిపోవడంతో తోటలు, పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో పొలాల్లో పశువులను మేపాల్సిన పరిస్థితి నెలకొంది.

అప్పు చేసి మరీ బోరు వేసినా చుక్క నీరు రాలేదు



యాసంగి సీజన్‌లో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. వర్షాలు లేక బోర్లలో నీళ్లు రాకపోవడంతో పంట మొత్తం ఎండిపోతుండటంతో చూడలేక అప్పు తెచ్చి బోరు వేశా. అయినా చుక్క నీరు రాకపోవడంతో పొలం మొత్తం పూర్తిగా ఎండింది. ఎండిన పంటలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

● ముడావత్ హనుమ, బాబ్లతండా, రైతు



డిండి ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

డిండిలో దండిగా నీరున్నా...

డిండి, ఏప్రిల్ 11 : పెట్టుబడిగా రూ.వేలు ఖర్చు పెట్టి యాసంగిలో సాగుచేసిన వరి పైర్లు నిలువునా ఎండుతున్నాయి. డిండి మండలంలో బోరు, బావుల ఆధారంగా 3,900 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇదిలా ఉండగా మండలంలోని గోనకోలు, బొగ్గులదొన, చెర్కుపల్లి, బొగ్గులదొన, జేత్యతండా గ్రామాలు డిండి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. ఎకరాకు రూ.35వేలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారు. ప్రస్తుతం డిండి రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 36 అడుగులుకాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 30 అడుగుల నీరు నిల్వ ఉంది. అయితే యాసంగి సీజన్‌లో సాగుకు నీటి విడుదల లేదని అధికారులు ముందే ప్రకటించారు. కానీ ఆయకట్టు రైతులు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేశారు. అయితే ప్రస్తుతం నీటి లభ్యత లేక గోనకోలులో సుమారు 120 ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోగా మరికొంత ఎండిపోయే దశలో ఉంది. ప్రాజెక్టు నిండా నీళ్లు ఉన్నా తమ పంటలు ఎండిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాన్ ఆయకట్టులోని కందుకూరు, వీరబోయినపల్లి, ఇతర గ్రామాల్లో పంట ఎండిపోవడంతో రైతులలో ఆందోళన నెలకొంది.



గోనకల్లులో ఎండిన వరి చేను

డిండి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి



ఎండుతున్న యాసంగి వరి పంటలకు డిండి ప్రాజెక్టు నీటిని విడుదలచేసి కాపాడాలి. ఈ యాసంగిలో 7 ఎకరాలలో వరిసాగుచేసి రెండున్నర లక్షలు పెట్టుబడులు పెట్టాను. నోటికాడికొచ్చిన పంటచేను నీరులేక నిలువున ఎండిపోయింది.

సూదిని రుక్మారెడ్డి, రైతు, గోనకోలు



శిథిలమైన గేట్లు.. లీకేజీలతో వృథా అవుతున్న నీరు

కేతేపల్లి : మూసీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యంతో నీటితో నిండుగా ఉన్న చెరువు ఖాళీ అవుతోంది. ఐదు రోజులుగా చెరువు నీరు వృథాగా వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉన్న కేతేపల్లి మండలం బొప్పారంలోని ఊర కుంట దుస్థితి ఇది. ఇటీవలి వరకు కాల్వకు నీటిని విడుదల చేయడంతో నీటితో చెరువుగా నిండుగా ఉంది. నీటి విడుదల నిలిపివేయడంతో చెరువుకు ఉన్న మూడు గేట్లు సైతం మూసివేశారు. అయినా శిథిలమైన గేట్ల నుంచి నీరంతా వృథాగా దిగువన వెళ్తోంది. ఇదే రీతిన నీటి వృథా కొనసాగితే 20రోజుల్లో చెరువు ఖాళీ అవుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నీటి వృథాపై మూసీ ప్రాజెక్టు ఏఈ ఉదయ్ వివరణ ఇచ్చారు. బొప్పారం ఊరకుంట చెరువు కొత్తగేట్ల కోసం రూ.43 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. అత్యవసరంగా గేట్ల నిర్మాణ పనుల కోసం అనుమతించాలని కలెక్టర్‌నూ కోరామని, అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

తల్లిదండ్రుల గొడవతో కుమార్తె ఆత్మహత్య

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 11 : తల్లిదండ్రుల మధ్య ఉన్న గొడవలు కుమార్తెను బలి తీసుకున్నాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన సావర్కర్‌నగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మాడ్గులపల్లి మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల సైదులు, సంధ్యారాణి దంపతులు కొంతకాలం కిందట నల్లగొండ పట్టణానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. వీరికి కుమార్తె యోగిత(22), కుమారుడు ఉన్నారు. సైదులు వ్యవసాయం చేస్తుండగా, సంధ్యారాణి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తోంది. ఇటీవల భార్యాభర్తలకు మధ్య మనస్పర్థలు రావడంతో పట్టణంలోనే వేర్వేరుగా చోట్ల ఉంటున్నారు. కుమార్తె యోగిత హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉగాది పండుగ సందర్భంగా సెలవులకు ఇంటికి వచ్చిన యోగిత తల్లిదండ్రుల మధ్య విభేదాలతో తీవ్ర అసహనానికి గురై బుధవారం మధ్యాహ్నం తల్లి నివసించే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. తండ్రి సైదులు కుమార్తెకు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో భార్య సంధ్యకు సమాచారం ఇచ్చాడు. ఆస్పత్రి నుంచి తిరిగి వచ్చి చూసే సరికి యోగిత ఉరివేసుకుని కనిపించింది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెదడులో రక్తం గడ్డకట్టి హోంగార్డు మృతి



సైదులు(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 11 : షుగర్ లెవల్ పెరగడంతో మెదడులో రక్తం గడ్డకట్టి ఓ హోంగార్డు గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగింది. పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన కారింగుల సైదులు(52) స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న సైదులుకు షుగర్ లెవల్స్ పెరిగి మెదడులో రక్తం గడ్డకట్టి ఇంటి వద్ద పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సైదులకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెల వివాహం కాగా, కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు. హోంగార్డు మృతి చెందిన విషయం తెలుసుకున్న హోంగార్డుల జిల్లా ఇన్‌చార్జి, ఆర్ఐ నరేష్, వన్‌టౌన్ సీఐ సుధాకర్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. హోంగార్డు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎస్ఐలు శ్రీనునాయక్, శేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రాధాకృష్ణ, హోంగార్డులు కోడిరెక్క కిరణ్, రషీద్, శ్రీను, కొండల్, రామ్‌కుమార్, లింగయ్య, సాయిరెడ్డి, గోపి, రాంజీ, వెంకన్న, స్వర్ణలత తదితరులు ఉన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

మోటకొండూరు, ఏప్రిల్ 11 : డాబాపై నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడును దొంగలు చోరీ చేశారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. డీసీపీ రాజేష్‌చంద్ర, బాధితురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాటేపల్లి గ్రామానికి చెందిన గడ్డం నిర్మల భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి తన డాబాపై నిద్రించింది. గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోంచి మూడు తులాల నాలుగు గ్రాముల బంగారు పుస్తెలతాడు అపహరించాడు. అలికిడికి బాధితురాలు కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న డీసీపీ రాజేష్‌చంద్ర గురువారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితురాలితో మాట్లాడారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తేజంరెడ్డి తెలిపారు. ఆయన వెంట ఏసీపీ రమేష్, సీఐ కొండల్‌రావు ఉన్నారు. జిల్లాలో నాలుగు రోజులుగా చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ రాజేష్‌చంద్ర సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 8712662762 ఫోన్‌నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగ ఆచూకీ తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు రూ. 25వేలు నగదుగా ఇస్తామన్నారు.

పటిష్ఠంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం: ఎస్పీ

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పటిష్ఠంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆ జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంట నిఘా పెట్టామన్నారు. కోదాడ మండలంలోని రామాపురం ఎక్స్‌రోడ్డు వద్ద, మఠంపల్లి బ్రిడ్జి వద్ద, దొండపాడు, పులిచింతల ప్రాజెక్టుల వద్దతో పాటు చింత్రియాల, బుగ్గమాధారం గ్రామాల వద్ద అంతర్రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు జాతీయరహదారి-65పై టేకుమట్ల, బీమారం, పాత తిరుమలగిరి, వెలిశాల, మామిళ్ళగూడెం, శాంతినగర్, చిల్లేపల్లి, కుంటపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి గురువారం వరకు జిల్లా వ్యాప్తంగా రూ. 1,71 కోట్ల నగదు, రూ. 7,75 లక్షల మద్యం, రూ.20వేల విలువైన గంజాయి, రూ.కోటి 14లక్షల విలువైన ఆభరణాలు, 86 లక్షల విలువైన వస్తువులను సీజ్ చేశామన్నారు. అదేవిధంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.75లక్షల విలువైన మద్యం సీజ్ చేశామన్నారు.

పాలకవీడు కానిస్టేబుల్ సస్పెన్షన్

పాలకవీడు, ఏప్రిల్ 11 : ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన సూర్యాపేట జిల్లా పాలకవీడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విష్ణును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రాహుల్ హెగ్డే ఉత్తర్వులు జారీ చేశారు. నేరేడుచర్ల మండలానికి చెందిన చింతల చెర్వు విష్ణు మూడు రోజుల కిందట నేరేడుచర్ల మండల రాజకీయ నాయకుడి బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్నాడు. విషయం జిల్లా ఎస్పీ దృష్టికి వెళ్లడంతో పూర్తి విచారణ చేపట్టి గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళపై దాడి కేసులో ముగ్గురిపై అట్రాసిటీ కేసు

అనంతగిరి, ఏప్రిల్ 11 : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలకేంద్రంలో వైన్‌షాప్‌లో పనిచేస్తున్న మహిళపై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. వైన్‌షాపులో గొడవను స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళ వారించేందుకు ప్రయత్నించగా, నిందితులు ఆమెపై దాడి చేశారన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేతేపల్లిలో విషాదఛాయలు

సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

కేతేపల్లి, ఏప్రిల్ 11 : సూర్యాపేట జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు మృతితో వారి స్వగ్రామం నల్లగొండ జిల్లా కేతేపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికందివస్తున్న పిల్లలు మృత్యువాత పడడంతో తల్లిదండ్రుల ఆక్రందనలు అందరినీ కంటతడి పెట్టించాయి. ప్రమాద సంఘటన సమాచారం అందిన వెంటనే గ్రామస్థులు పెద్దఎత్తున సూర్యాపేటకు తరలివెళ్లారు. కేతేపల్లికి చెందిన ధనుష్, అంతటి నవీన్, ఆబ్బూరి గణేష్, జటంగి సాయితేజ, మారగోని మహేష్ గురువారం కారులో సూర్యాపేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో నవీన్(18), సాయితేజ(17) అక్కడికక్కడే మృతి చెందగా గణేష్, ధనుష్, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు.





చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు, సూర్యాపేట ఆసుపత్రి వద్ద యువకుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మృతులు ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ

మృతుడు అంతటి నవీన్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి నాగమణి కూలీనాలి చేస్తూ కుమార్తె, కుమారుడిని చదవిస్తోంది. కుమార్తె పెళ్లి చేసి భారం దించుకున్నా అని ధైర్యంతో ఉన్న ఆమెకు పిడుగుపాటు లాంటి కుమారుడి మరణంతో తల్లడిల్లిపోయింది. మరో మృతుడు జటంగి సాయి కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే. కుమారుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు కంటికిమింటికి ధారగా రోదిస్తున్నారు. గ్రామంలో నలుగురు కూడిన చోట మృతులు, క్షతగాత్రుల కుటుంబాల స్థితిగతులే చర్చనీయాంశమయ్యాయి. నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సాయంత్రం గ్రామానికి చేర్చగానే మృతుల ఇళ్ల వద్దకు తరలి వచ్చిన గ్రామస్థులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనల మధ్య గురువారం రాత్రి పొద్దుపోయాక మృతులు ఇరువురికి అంత్యక్రియలు పూర్తయ్యాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నార్కట్‌పల్లి వద్ద రాజస్థాన్‌కు చెందిన యువకుడి మృతి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 11 : రంజాన్ పర్వదిన రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన ముస్లిం యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ 65వ నెంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సాజిద్ చెన్నై నుంచి హైదరాబాద్‌కు వాహనంలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి శివారులోని దుర్గా హోటల్ వద్ద ఉదయం వాహనం ఆపిన సాజిద్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలై సాజిద్ అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. కాగా వాహనంలో సాజిద్‌తో పాటు ప్రయాణిస్తున్న హేమ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు...



మహేష్(ఫైల్)

అడ్డగూడూరు, ఏప్రిల్ 11 : యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన ఉప్పుల మహేష్(27) హైదరాబాదులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉగాది పండుగ కోసం ఈ నెల 8న బైక్‌పై స్వగ్రామం చిర్రగూడూరు వస్తుండగా మార్గమధ్యలో బొడ్డుగూడెం స్టేజీ సమీపంలో బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ప్రశ్నించే నాయకుడిని పార్లమెంట్‌కు పంపించాలి

చిట్యాల రూరల్, ఫిబ్రవరి 11: పార్లమెంట్‌లో ప్రజల గొంతుకై ప్రశ్నించే వ్యక్తిని ప్రజా ప్రతినిధిగా పంపించాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో గురువారం నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డితో కలిసి మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ వారి సమస్యలను తీర్చే సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను ఎన్నుకోవాలని కోరారు. ప్రజల గొంతును వినిపించే నాయకుడు ప్రస్తుతం ఎంతో అవసరమని, అలాంటి వ్యక్తిని పార్లమెంటుకు పంపించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. సీపీఎం అభ్యర్థి పార్లమెంట్‌లో ఉన్నటయితే ప్రజా గొంతుకగా నిలుస్తారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహంగీర్‌ను గెలిపించి సమస్యల సాధన కోసం ప్రజానాయకుడిగా నిలుపుదామన్నారు. సమావేశంలో సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, నెలికంటి నర్సింహ, మల్లం మహేష్, కత్తుల లింగస్వామి, ఎంపిటిసి దేశబోయిన స్వరూపనర్సింహ, నరేష్, శంభయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

ఉపాధి పథకంలో 1894 సర్క్యులర్‌ను అమలు చేయాలి

చిట్యాల రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో 1894 సర్క్యులర్‌ను ప్రభుత్వం అమలు చేసి తీరాల్సిందేనని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. చిట్యాల మండలం పేరేపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కూలీలు పని చేసే ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలను కల్పించాలని ముఖ్యంగా వేసవి దృష్ట్యా నీటి సౌకర్యం, నీడ కోసం గుడారాలు ఏర్పాటుచేయాలన్నారు. అంతేకాకుండా ఈ నెల ఒకటి నుంచి కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తామని ప్రకటించిన కూలీలకు రోజుకు రూ.300లు నేటి వరకు కూడా అమలు కాలేదని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వడదెబ్బకు గురికాకుండా ఉదయం వేళల్లోనే పనులు ముగించాలన్నారు. కార్యక్రమంలో కత్తుల లింగస్వామి, మెట్టు పరమేష్, అరూరి నర్సింహ, అరూరి నర్సింహ, అంతటి యాదయ్య, అంతటి నర్సింహ, వెంగళి రేణుక, బొడిగె శోభ, అంతటి పార్వతమ్మ, అంజమ్మ, పారిజాత, రజిత, ప్రభావతి, ఉమ, పద్మ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో 20 ఎకరాల వరి గడ్డి దగ్ధం

గరిడేపల్లి, ఏప్రిల్ 11: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మంగాపురం గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధమైంది. గ్రామానికి చెందిన ధరావత్ వెంకన్న, అకర్, సఖ్య, దర్మ, అంజయ్య, సైదాలకు చెందిన సుమారు 20 ఎకరాల వరిగడ్డి గురువారం మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్ స ర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ఎండా కాలం కావడంతో రైతులు పొలం కోసిన తర్వాత గడ్డిని కట్టలు కట్టి గ్రామ శివారులో వాములుగా ఏర్పాటు చేసుకున్నారు. వాములకు దగ్గరలో విద్యుత్ మోటారు ఉండడంతో షార్ట్ సర్క్యూట్ అయి వాములకు నిప్పంటుకున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రతకు ఫైర్ ఇంజన్ వచ్చే సరికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది.

గోపసముద్రంలోనూ

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 11 : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గోపసముద్రంతండాలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అజ్మీరాబాబు తన పాడి గేదెల మేత కోసం రూ.90వేలు ఖర్చు చేసి 600 మోపుల గడ్డిని తన ఇంటి సమీపంలో నిల్వచేశాడు. గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుని దగ్ధమైంది. నిరుపేద కుటుంబానికి చెందిన అజ్మీరాబాబుకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వన్యప్రాణులకు నీటి సమస్య లేకుండా చర్యలు

● నాగార్జునసాగర్ డివిజన్ అటవీశాఖ అధికారి సర్వేశ్వర్‌రావు


నీటి తొట్లను పరిశీలిస్తున్న సర్వేశ్వర్‌రావు

దేవరకొండ, ఏప్రిల్ 11: నల్లమలలో అటవీ జంతువులు, వన్యప్రాణులకు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నాగార్జునసాగర్ డివిజన్ అటవీశాఖ అధికారి సర్వేశ్వర్‌రావు కోరారు. నల్లమల కంబాలపల్లి రేంజ్ పరిధిలో కంబాలపల్లి, పొగిళ్ల, రేకులవలయం అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు, అటవీ జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందున నీటితొట్లలో రోజువారీగా నీరు నింపాలని అన్నారు. నీటి సమస్య ఉంటే అదనంగా బోర్లు వేసి పైపుల ద్వారా నీరు అందించాలని అధికారులను సూచించారు. ఇప్పటికే నల్లమలలో తాగునీటి కోంస వందకుపైగా నీటితొట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటితొట్లతో పాటు చెక్‌డ్యాంలు, కుంటల్లో నీరు నింపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెల్‌దేవరపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తుందని సమాచారం ఉన్నందున అటవీశాఖ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అటవీ జంతువులు, వన్యప్రాణులు అడవిని దాటి బయటకు వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కంబాలపల్లి రేంజ్ అటవీశాఖ అధికారి భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు


మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీవో మురళి

త్రిపురారం, ఏప్రిల్ 11: తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా పంచాయతీ అధికారి మురళి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని మంచి నీటి ట్యాంకులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న మినీ ట్యాంకులకు మరమ్మతులు ఉన్నట్లయితే ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీవో కొడిరెక్క, రాజేంద్రకుమార్, పంచాయతీ సిబ్బంది వల్లపుదాసు సైదులు, అధికారులు ప్రకాష్, మట్టయ్య, సత్తిరెడ్డి, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం

● ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవంలో జూలకంటి


జెండాను ఆవిష్కరిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 11: స్వాతంత్ర్యానికి ముందు దున్నేవానికే భూమి అనే నినాదంతో జరిగిన రైతాంగ పోరాటమే నేటికీ స్ఫూర్తి దాయకమని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ (ఏఐకేఎస్) జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఏఐకేఎస్ సంఘ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1936లో ఏఐకేఎస్ ఆవిర్భవించిందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం నాటి నుంచి రాజీలేని పోరాటాలు చేస్తుందని అన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. దున్నేవానికే భూమి, భూమి శిస్తుకు వ్యతిరేకంగా, పంటకు గిట్టుబాటు ధర కోసం దృఢ సంకల్పంతో రైతు ఉద్యమాలు కొనసాగించినట్లు తెలిపారు. సుమారు 80మంది రైతులు నాటి పోరాటంలో 80మంది రైతులు మృతి చెందినట్లు గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగించిందని అన్నారు. మోదీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగం రద్దవుతుందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ పేదలకు అన్యాయం చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో గద్దె దించాలని కోరారు. ఇండియా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర నాయకుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర నాయకులు డబ్బీకార్ మల్లేష్, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రాంమూర్తి, ఊర్మిల, గోవిందరెడ్డి, చౌగాని వెంకన్న, కోటిరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదశక్తులకు బుద్ధి చెప్పాలి

మిర్యాలగూడ అర్బన్: భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మనదేశంలో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మతసామరస్యం వికసించి మతోన్మాద శక్తులకు బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసామ్య వ్యవస్థలో విలువైన ఓటు హక్కును ప్రజలు ఆలోచనాత్మక ధోరణిలో ఉపయోగించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సమస్యలు ఉన్నంత వరకు సమాజంలో కమ్యూనిస్టుల ఆదరణ లభిస్తూనే ఉంటుందన్నారు.

పేదలకు భూములు పంచాలని పోరాడిన ఏఐకేఎస్

కేతేపల్లి: అర్హులైన పేదలకు భూములు పంచాలని బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, భూస్వాములతో పోరాడిన చరిత్ర అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)దేనని మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాళ ప్రమీల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బి.చిన వెంకులు, సీహెచ్.లూర్దుమారయ్య, ఎల్.రాజు, ఆదిమల్ల సుధీర్, కోట లింగయ్య, కె.బాలయ్య, కె.శోభన్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండలో శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


నకిరేకల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం


తిప్పర్తిలో...


నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఈద్గాలో ముస్లింల సందడి


దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్...


నల్లగొండ : ఏఎస్పీ రాములునాయక్‌ను సన్మానిస్తున్న ముస్లింలు


మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి...


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి


నల్లగొండలో మాట్లాడుతున్న మౌలానా, ఈద్గా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

భక్తి శ్రద్ధలతో రంజాన్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): పవిత్ర ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగను ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గాకు అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై సామూహిక ప్రార్థనలతో పాటు దువా చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ వేడుకలను నిర్వహించుకున్నారు. స్థోమతకు తగినట్లుగా దానధర్మాలు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈద్గాల వద్ద అధికారులకు, ప్రజాప్రతినిధులకు వేర్వేరు వేదికలు ఏర్పాటు చేశారు.

జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ, నకిరేకల్, హాలియాలలోని ఈద్గాల వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు బాలునాయక్, బి.లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, కుందూరు జైవీర్‌రెడ్డి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండలో ఈద్గా వద్ద నల్లగొండ ఎంపీ అభ్యర్థులు కుందూరు రఘువీర్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కౌన్సిలర్లు, ముస్లిం పెద్దలు డాక్టర్ హఫీజ్‌ఖాన్, ఏఏ ఖాన్, ఇంతియాజ్ అలీ, సలీం, ఆదిరెడ్డి, నర్సిరెడ్డి, హాషం, షరీఫ్, కరీం అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, స్కైలాబ్ నాయక్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

జ్యోతిరావుపూలేను ఆదర్శంగా తీసుకోవాలి


దేవరకొండలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


మిర్యాలగూడలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ నివాళి


కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచందర్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): మహాత్మా జ్యోతిరావుపూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. జిల్లాలోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో గురువారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ, బీసీ సంక్షేమ, యువజన సంఘం, తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం, బీసీ ఉద్యోగ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని అన్నారు. గొప్ప సామాజికసంఘ సంస్కర్తగా బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. సమాజ అభివృద్ధి కోసం పూలే అనుసరించిన మార్గాలు ఆచరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

● మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సాగర్‌రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, జీడయ్యయాదవ్, సైదులు, బంటు వెంకటేశ్వర్లు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

●శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో రేఖల లక్ష్మయ్య, సూపరింటెండెంట్ సుందరయ్య, సిబ్బంది హరినాథరాయుడు, విశ్వనాథుల వెంకటాచారి పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో ఎంపీడీవో తిరుమలస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, రాధారపు బిక్షపతి, ఐతరాజు యాదయ్య, శ్రీను, పెద్దులు, బయ్యన్న, రవి పాల్గొన్నారు.

● తిప్పర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మీలింగారావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

● పెద్దవూరలో జాతీయ విగ్రహాల నిర్మాణ కమిటీ వ్యవస్థాపకుడు పులిమాల కృష్ణారావు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ లింగయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఎమ్మెల్యే బాలునాయక్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ సభ్యుడు దూదిపాల వేణుధర్‌రెడ్డి, జాలె నర్సింహారెడ్డి, నాయకులు ఎంఏ. సిరాజ్‌ఖాన్, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, ఏపీవో కడియం రామోహన్, గోవిందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● డిండిలో నాయకులు బొల్లె శైలేజ్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, నూకం వెంకటేష్, లక్ష్మణ్, ఈశ్వర్, చంద్రయ్య, సలీం, సాయి, దినేష్ పాల్గొన్నారు.

● చిట్యాలలో పోకల దేవదాస్, జిట్ట నగేష్, బోడ స్వామి, గాలి లింగయ్య, అశోక్ పాల్గొన్నారు.

● మర్రిగూడలో ఎంపీడీవో మున్నయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

● హాలియాలో టీపీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్, నాయకులు పాపిరెడ్డి, జైపాల్‌రెడ్డి, జయరాంనాయక్ పాల్గొన్నారు.


జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో, సిబ్బంది


బీసీ సంఘాల ఆధ్వర్యంలో నివాళులు


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న రాఖీ

గుర్రంపోడు, ఏప్రిల్ 11: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ అన్నారు. గుర్రంపోడులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు చేసిన కుంభకోణాలు కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. బీజేపీ యువమోర్చా వారిని వదిలిపెట్టదని, కుంభకోణాలను వెలికితీస్తామన్నారు. నల్లగొండలో కుటుంబ పాలనకు స్వస్తి పలకాలన్నారు. మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బొంగరాల ప్రశాంత్, నాయకులు రామకృష్ణ, శివ, వెంకటేష్, ప్రకాష్, మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా సైదులు

కనగల్, ఏప్రిల్ 11: బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని బుడమర్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పంతంగి సైదులుగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నల్లగొండలో జరి గిన సమావేశంలో నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సైదులుగౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

ముస్లింలకు తాగునీరు సరఫరా

నల్లగొండ, ఏప్రిల్ 11: రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద తెలంగాణ మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడతాల నాగరాజు ఆధ్వర్యంలో ముస్లింలకు తాగునీటిని అందజేశారు. తాగునీరు సరఫరా చేయడంపై పలువురు ముస్లింలు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కత్తుల రవి, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలి : నాగిరెడ్డి

హాలియా, ఏప్రిల్ 11: పార్లమెంట్‌లో రైతాంగానికి మద్దతు ధర చట్టం చేయడంలో విఫలమైన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కూ న్‌రెడ్డి నాగిరెడ్డి, సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం వారు రైతు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 1936 ఏ ప్రిల్ 11న ఆల్ ఇండియా కిసాన్ సభ ఏర్పడిందన్నారు. అర్హులైన పేదలకు భూమి దక్కాలని, కౌలు రేట్లు తగ్గించాలని, గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతులకు రుణాలు మాఫీ చేయాలని అనేక ప్రాంతీయ డిమాండ్లను తీసుకొని నిరంతరం పోరాటాలు నిర్వహించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాన్ని రైతాంగం గమనించాలని కోరారు. ఎన్నికలు జరుగుతున్న ఈసందర్భంలో రైతు రుణాల గురించి, కనీసం మద్దతు ధర చట్టం గురించి మాట్లాడటం లేదన్నారు. కలిసి వచ్చే రైతు సంఘాలను కలుపుకొని ఆందోళన, పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కారంపొడి ధనమ్మ, పొదిల వెంకన్న, రాంరెడ్డి, కూన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భిక్షమయ్య మృతి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 11: మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యల్లమల్ల భిక్షమయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి గురువారం భిక్షమయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, నాయకులు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, వినయ్‌రెడ్డి, నాగరాజు, మేరావత్ మునినాయక్, కృష్ణానాయక్, చిన్న రామ య్య, హచ్చునాయక్, శౌరినాయక్, నాగేందర్‌నాయక్, కొండల్, బిక్కునాయక్, బిచ్చాలునాయక్, సైదారావు, కాశీరాం, శ్రీను, నాగరాజు, రాము పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు విస్తరింపజేయాలి

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 11: సామాజిక సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ పాత్రను మరింతగా విస్తరింపజేయాలని డిస్ట్రిక్ గవర్నర్ శంకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం రోటరీక్లబ్ నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం...

ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలి

చిట్యాల, ఏప్రిల్ 11: ప్రధాని నరేంద్రమోదీకి ప్రజలంతా మరోసారి మద్దతుగా నిలవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాస శ్రీనివాస్ కోరారు. గురువారం చిట్యాల మునిసిపాలిటీలోని 98వ బూత్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయారపు రామకృష్ణ, గురిజ రాజేష్, నాతి మధు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 11: తుంగతుర్తిలో ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, శానాల యుగేందర్‌రెడ్డి కోరారు. శాలిగౌరారంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తిలో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే మందుల సామేల్, మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మంగదుడ్ల బల రాం, మాచర్ల శ్రీరాములు, మన్నెం వెంకన్న, కొల్లు రవీందర్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

టాప్రా ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 11: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ (టాప్రా) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో మ్యాక్స్ విజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలను నిర్వహించనున్నట్లు టాప్రా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులపై ఉచిత కంటి పరీక్షలతో పాటు ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న సాధారణ వ్యక్తులను కూడా పరీక్షించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

మర్రిగూడ, ఏప్రిల్ 11: అనుమతి లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నాంపల్లి ఎస్ఐ లచ్చిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని సుంకిశాల గ్రామంలో గురువారం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆంజనేయులు అనే వ్యక్తి వద్ద మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు. అతడిని బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహించినా సహకరించిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోపసముద్రం తండాలో గడ్డివాము దగ్ధం

మిర్యాలగూడరూరల్, ఏప్రిల్ 11: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని గోపసముద్రం తండాలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు అజ్మీరాబాబు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అజ్మీరాబాబు తన పాడి గేదెల మేత కోసం రూ.90వేలు ఖర్చు చేసి 600 మోపుల గడ్డిని తన ఇంటి సమీపంలో వాము వేశాడు. ప్రమాదవశాత్తు గురువారం గడ్డివాము దగ్ధమవడంతో బాధితుడు కన్నీరుమున్నీరుగా విలపించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అజ్మీరాబాబుకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 11: వేసవి దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం దాతలు ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను ప్రజలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద కోట్ల జగదీష్, నరందాసు పవన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ యువత స్వశక్తితో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ సభ్యుడు దూదిపాల వేణుధర్‌రెడ్డి, జాలె నర్సింహారెడ్డి, నాయకులు ఎంఏ.సిరాజ్‌ఖాన్, పస్నూరి యుగేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంఏ. కైసర్‌ఖాన్, అందుగుల ముత్యాలు, పెద్దిశెట్టి సుధాకర్, చందా ధనంజయ్య, కోట్ల జగదీష్, బూడిద మల్లేష్‌యాదవ్, ఊరె నరేష్, బోడ అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.